సాక్షి ప్రకాశం

ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023



బాబుది లెక్కలేనంత అవినీతి

చంద్రబాబునాయుడు లెక్కలకు అందనంత అవినీతికి పాల్పడ్డాడని కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు.

- IIలో..



టీడీపీ స్కాముల్లో ఒకటి మాత్రమే ఇది

తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చేసిన స్కాముల్లో స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం ఒకటి మాత్రమేనని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు.

- IIలో..

గరిష్టం/కనిష్టం 36/28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు మాజీమంత్రి బాలినేని రాక

ఒంగోలు: మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదివారం నియోజకవర్గంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 6.30 గంటలకు సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలుకు చేరుకుంటారు. 10 గంటలకు కొత్తపట్నం మండలం సంకువానిగుంటలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. 10.45 గంటలకు ట్రంకురోడ్డులోని అప్సర లాడ్జి ఎదురుగా కేకే బిర్యాని పాయింట్ ప్రారంభోత్సవంలో, 11 గంటలకు కృష్ణ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంకమ్మపాలెంలో జరిగే శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొంటారు. రాత్రి 8 గంటలకు రంగారాయుడు చెరువు వద్ద గాంధీ పార్కులో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ జాతీయ చాంపియన్‌షిప్ బహుమతి ప్రదానోత్సవంలో పాల్గొంటారు.

డోను-గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలు రద్దు

గిద్దలూరు రూరల్: రెండు నెలల నుంచి రద్దయిన డోన్-గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలును డబుల్ లైన్ పనుల కారణంగా ఈనెల 17వ తేదీ వరకు రద్దు చేసినట్లు రైల్వే కమర్షియల్ సూపరింటెండెంట్ పి.లక్ష్మీనారాయణ శనివారం తెలిపారు. గిద్దలూరు రైల్వే స్టేషన్‌కు ఉదయం 9 గంటలకు డోను నుంచి గుంటూరుకు వెళ్లే రైలు, సాయంత్రం గుంటూరు నుంచి డోన్ వెళ్లే రైలును ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు రద్దు చేసినట్లు ఆయన తెలిపారు.

వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



కలెక్టరేట్ వద్ద దీక్ష చేస్తున్న మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు

ఒంగోలు టౌన్: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే మాదిగ ఉపకులాలకు ఇచ్చిన మాటను నిలుపుకుంటూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కలిగించాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు తోరటి ఆనంద్ విజ్ఞప్తి చేశారు. శనివారం కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ ఈనెల 8 నుంచి ప్రారంభమైన దీక్షలు 22వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. 18వ తేదీ నుంచి జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టాలని కోరారు. లేని పక్షంలో 2024 ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వర్గీకరణ కోరుతూ ప్రధాన మంత్రికి లేఖ రాయడమే కాకుండా ప్రైవేటు బిల్లు ప్రవేశ పెట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురేష్ కోరారు. ఈ దీక్షలో పి.కాశీరావు, పి.సుప్రజ, బూదాల సురేష్, అనపర్తి సిద్దయ్య, గద్దే పున్నయ్య పాల్గొన్నారు.

ఎవరూ పట్టించుకోలేదు..బాబూ!

- బాబు అరెస్టుపై స్పందించని ప్రకాశం
- ప్రజల నుంచి కానరాని స్పందన
- కనీసం టీడీపీ నేతలు, కేడర్ నుంచి స్పందన కరువే
- గిద్దలూరు మండలం దిగువమెట్ట గ్రామం నుంచి జిల్లాలోకి
- సుమారు 175 కిలోమీటర్లు జిల్లాలో ప్రయాణం
- ఒకటి రెండు చోట్ల మాత్రమే మొక్కుబడిగా నిరసనలు
- పార్టీ జిల్లా కార్యాలయం వద్ద కొద్ది మందితో ఆందోళన
- చంద్రబాబు అడ్డంగా దొరికిపోవటంతో నిరుత్సాహంలో టీడీపీ నేతలు
- 4.20 గంటల పాటు బాబు కాన్వాయ్ ప్రయాణం



చీమకుర్తి మీదుగా విజయవాడ వెళ్తున్న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడును సీఐడీ పోలీసులు అరెస్ట్ చేసి జిల్లాలోనుంచి కాన్వాయ్‌తో తీసుకెళుతుంటే అటు ప్రజల నుంచి కానీ, ఇటు సొంత పార్టీ టీడీపీ నాయకుల నుంచి కానీ స్పందన కరువైంది. 4.20 గంటల పాటు జిల్లాలో చంద్రబాబు కాన్వాయ్ ప్రయాణించింది. దాదాపు 175 కిలో మీటర్లు ప్రయాణించినా కూడా చంద్రబాబు కాన్వాయ్‌ను అడ్డుకున్న దాఖలాలు శూన్యం. చీమకుర్తి మండలంలో ఒకటి, రెండు చోట్ల మినహా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దగా చంద్రబాబు కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు కూడా ప్రయత్నించలేదు. జిల్లాలో ఆర్టీసీ బస్సులు తిరిగాయి. వ్యాపార సంస్థలు సైతం తెరిచే ఉంచారు.ఎక్కడా జనం కనిపించకపోవడంతో చంద్రబాబు సైతం ఢీలా పడ్డారు. జనం కనపడితే ఎప్పుడూ విక్టరీ సింబల్ చూపించే ఆయన కాన్వాయ్ వెళుతున్న ప్రధాన కూడళ్లలో అరకొరగా ఉన్న జనాన్ని, పార్టీ నాయకుల్ని చూస్తూ ముందుకు వెళ్లిపోయారు. ఈ స్కాంలో చంద్రబాబు తప్పుచేశాడన్న భావన ఆపార్టీ నేతల్లో సైతం వ్యక్తమైనట్లుగా తెలుస్తోంది. నంద్యాల నుంచి జిల్లాలోని గిద్దలూరు మండలం దిగువమెట్ట గ్రామంలోకి ఉదయం 8.45 గంటలకు చంద్రబాబు కాన్వాయ్ ప్రవేశించింది. అక్కడ నుంచి గిద్దలూరు, మార్కాపురం, సంతనూతలపాడు, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నుంచి కాన్వాయ్ మధ్యాహ్నం 1.05 గంటలకు జిల్లా సరిహద్దులు దాటింది. జిల్లాలో దాదాపు 100కు పైగా గ్రామాల్లో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా కాన్వాయ్ సాగింది. తొలుత గిద్దలూరు నియోజకవర్గంలోని దిగువమెట్ట వద్ద చంద్రబాబు కాన్వాయ్ ప్రవేశించింది. అయితే గిద్దలూరు నియోజకవర్గ ప్రజల నుంచి కానీ టీడీపీ నాయకులు, కార్యకర్తల నుంచి కానీ ఎలాంటి కనీస స్పందన కరువైంది. మార్కాపురం నియోజకవర్గంలో కూడా అదే పరిస్థితి నెలకొంది. సంతనూతలపాడు నియోజకవర్గంలో కూడా ఎలాంటి అడ్డంకులు లేకుండా ముందుకు సాగింది. జిల్లా కేంద్రం ఒంగోలులో కూడా ఆ పార్టీ కేడర్ నుంచే స్పందన కానరాలేదు.

టీడీపీ శ్రేణుల్లో నైరాశ్యం..

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయాడని టీడీపీ శ్రేణుల్లోనే నైరాశ్యం నెలకొంది. విజయవాడ సీఐడీ పోలీసులు అరెస్ట్ చేసి జిల్లాలో ఆయన కాన్వాయ్ వెళుతున్నా ఆ పార్టీ నాయకుల్లో కూడా కనీసం కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం కూడా చేయలేదంటే కుంభకోణం తీవ్రత ఎంతో టీడీపీ నాయకులే అర్థం చేసుకున్నట్లు ఉన్నారు.

భగ్గుమంటదని ఎల్లో మీడియా ఊదర...

చంద్రబాబును అరెస్ట్ చేస్తే రాష్ట్రం భగ్గుమంటుందని ఎల్లో మీడియా ఊదర గొట్టింది. జనాలు స్వచ్ఛందంగా రోడ్డు ఎక్కుతారని ఎల్లో మీడియా ప్రచారం చేసింది. అయితే అందుకు భిన్నంగా జిల్లాలో శనివారం కాన్వాయ్ వెళ్లినా ప్రజల్లో కనీస స్పందన కూడా లేదు. టీడీపీలో కూడా తూతూ మంత్రంగా ఒకటి రెండు చోట్ల మాత్రమే కాన్వాయ్‌ను అడ్డుకోవాలని ప్రయత్నించారు. చీమకుర్తి బైపాస్‌లో, పేర్నమిట్ట వద్ద కొద్దిమంది రోడ్డు మీదకు వచ్చి నిరసన వ్యక్తం చేయాలని పూనుకున్నారు. పోలీసులు అప్రమత్తమై నిరసనకారులను చెదరగొట్టారు. జిల్లా కేంద్రం ఒంగోలులో పార్టీ ఆఫీసు వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు తప్ప మరెలాంటి ఆందోళనలుకానీ, నిరసనలు కానీ చేపట్టలేదు. చంద్రబాబు కాన్వాయ్‌కి ఎలాంటి ఆటంకాలు లేకుండా జిల్లాలో సజావుగా సాగిపోయింది. చీమకుర్తి మండలం మర్రిచెట్లపాలెం, రామతీర్థం మధ్యలో 15 నిమిషాల పాటు చంద్రబాబు కాలకృత్యాలు తీర్చుకోవటానికి మాత్రమే పోలీసులు ఆపారు. అంతకు మినహా జిల్లాలో ఎక్కడా చంద్రబాబు కాన్వాయ్‌కు ఆటంకాలు ఏర్పడలేదు.

పకడ్బందీగా బందోబస్తు

ఒంగోలు టౌన్: వందలాది కోట్ల రూపాయల స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడును నంద్యాలలో అరెస్టు చేసిన సమాచారం తెలిసిన వెంటనే జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ మలికా గర్గ్ పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. చంద్రబాబును శనివారం ఉదయం నంద్యాల నుంచి ఒంగోలు మీదుగా విజయవాడకు తరలిస్తున్నారన్న సమాచారం అందగానే పోలీసు అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. జిల్లాలోకి ప్రవేశించిన నప్పటి నుంచి జిల్లా దాటి వెళ్లే వరకూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. ఉదయం 8.45 నిమిషాలకు జిల్లాలోకి ప్రవేశించిన కాన్వాయ్ గిద్దలూరు, బేస్తవారిపేట జంక్షన్, పొదిలి, చీమకుర్తి, సంతనూతలపాడు గుండా ఒంగోలుకు చేరుకుంది. ఒంగోలు నుంచి హైవే మీదుగా మద్దిపాడు గ్రోత్ సెంటర్ నుంచి చిలకలూరిపేట మీదుగా కాన్వాయ్ విజయవాడ వెళ్లింది. జిల్లాలో ప్రవేశించిన కాన్వాయ్‌కు దారిమధ్యలో ఎలాంటి ఆటంకాలు, అసౌకర్యం కలగకుండా పోలీసులు తగిన బందోబస్తు చర్యలు తీసుకున్నారు. ఎక్కడికక్కడ పికెట్లు, చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించడానికి ప్రయత్నించిన తెలుగుదేశం పార్టీ నాయకులను హౌస్ అరెస్టు చేశారు. ఆ పార్టీకి చెందిన 90 మంది ద్వితీయ శ్రేణి నాయకులను అదుపులోకి తీసుకున్నారు. తెలుగు మహిళలు కొందరు నిరసన ప్రదర్శనలు చేసేందుకు ప్రయత్నించి ప్రజల మద్దతు లేకపోవడంతో మిన్నకుండిపోయారు. నగరంలోని పాత మార్కెట్ వద్ద కొందరు టీడీపీ నాయకులు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. అద్దంకి బస్టాండు సెంటర్‌లో ధర్నాకు విఫలయత్నం చేశారు. ఒంగోలులోని గుంటూరు రోడ్డులో తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో పికెట్లను ఏర్పాటు చేశారు. నగరంలోకి ప్రవేశించే మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కట్టడి చేశారు. ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ వి.నారాయణస్వామి రెడ్డిల పర్యవేక్షణలో సీఐలు పి.భక్తవత్సలరెడ్డి, టి.వెంకటేశ్వరరావు, జగదీష్, శ్రీనివాసరెడ్డిలతో పాటు మొత్తం 200 మంది కానిస్టేబుళ్లు బందోబస్తులో పాల్గొన్నారు.

చట్టానికి ఎవరైనా ఒకటే

- యువతకు శిక్షణ పేరుతో రూ.371 కోట్ల స్కామ్‌కు పాల్పడడమేనా బాబు వస్తే జాబు రావడం
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి



బాలినేని శ్రీనివాసరెడ్డి



జంకె వెంకటరెడ్డి

ఒంగోలు: చట్టానికి సామాన్యుడైనా, చంద్రబాబు అయినా ఒక్కటే అని, స్కిల్‌డెవలప్‌మెంట్ పేరుతో భారీ దోపిడీకి పాల్పడిన చంద్రబాబును అరెస్టు చేయడం ప్రతి ఒక్కరూ స్వాగతిస్తున్నారని మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి శనివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. రూ.371 కోట్ల మేర జరిగిన ఈ అవినీతి స్కామ్‌పై జీఎస్టీ, ఇంటెలిజెన్స్, ఐటీ, ఈడీ, సెబీ సంస్థలు దర్యాప్తు నిర్వహించిన తరువాతే సీఐడీ చంద్రబాబును అరెస్టు చేసిందన్నారు. దోచేసిన సొమ్మును విదేశాలకు, అక్కడ నుంచి తిరిగి దేశంలోకి తీసుకొచ్చారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా పరిపాలించినంత కాలం ఒక మహా చక్రవర్తిలాగా, నియంతలాగా వ్యవహరిస్తూ వచ్చారని, ఆదేశిస్తే శిరసావహించడమే తప్ప కనీసం ఎదుటి వారి అభిప్రాయాన్ని కూడా పరిగణనలోనికి తీసుకునేవారు కాదన్నారు. కానీ రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవన్నారు. అందుకు చంద్రబాబు అరెస్టే ఉదాహరణ అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎంతటివారైనా చట్టం ముందు సమానమే అన్నారు. బాబు వస్తే జాబు అంటూ ఎన్నికల సమయంలో యువతను మభ్యపెట్టడమే కాకుండా చివరకు యువత పేరుతో రూ.371 కోట్ల స్కామ్‌కు పాల్పడడాన్ని యువత ప్రశ్నించాలన్నారు. నిరుద్యోగ భృతి సంగతి దేవుడెరుగు... శిక్షణ అంటూ యువత పేరును వాడుకుంటూ ఇంత పెద్ద మొత్తంలో స్కామ్‌కు పాల్పడిన చంద్రబాబు అండ్‌కోకు సరైన గుణపాఠం చెప్పేందుకు యువత నడుం బిగించాలన్నారు. డబ్బులు హవాలా మార్గంలో తరలించినట్లు వెల్లడైందని, ఇదంతా 2017లోనే బయపడిందని, అప్పుడు కూడా నాటి ప్రభుత్వం స్పందించకపోవడాన్ని బట్టి చంద్రబాబు పాత్ర ఎంత ఉందో ప్రజలు గమనించాలని, ఇంత పెద్ద స్కామ్‌కు పాల్పడినందునే చంద్రబాబును అరెస్టు చేసినట్లు బాలినేని శ్రీనివాస రెడ్డి, జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు.

పక్కా ఆధారాలతోనే బాబు అరెస్టు

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు: ప్రజల సొమ్ముకు ప్రభుత్వాలు జవాబుదారీగా ఉండాలని, అంతే తప్ప అక్రమంగా కాజేస్తే అరెస్టులు తప్పవని జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ స్పష్టం చేశారు. శనివారం స్థానిక తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అతిపెద్ద ఆర్థిక నేరానికి పాల్పడిన చంద్రబాబు అరెస్టు ముమ్మాటికీ సమర్థనీయం అన్నారు. ఈ వ్యవహారం ఇప్పటిది కాదని 2017 నుంచి కొనసాగుతోందన్నారు. అంటే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఈ వ్యవహారం బయటపడిందన్నారు. అయితే నాడు అధికారాన్ని అడ్డం పెట్టుకుని దర్యాప్తు ముందుకు సాగనీయకుండా చంద్రబాబు అడ్డుపడ్డారని విమర్శించారు. రోజులన్నీ ఒకేలా ఉండవని, పాపం పండే రోజు తప్పకుండా వస్తుందనేందుకు ఇదో ఉదాహరణ అన్నారు. నాడు ఎన్‌టీఆర్‌కు అన్యాయం చేశారని, విద్యాదాత, అన్నదాతగా పేరు ప్రఖ్యాతులు పొందిన తన భర్తను అన్యాయంగా నాడు చంద్రబాబు అరెస్టు చేయించి జైలుకు పంపారని, ఇటువంటి అనేక పాపాలు నేడు చంద్రబాబు బండారాన్ని రట్టు చేశాయన్నారు. నాడు అన్యాయంగా తన భర్తను అరెస్టు చేస్తే అన్యాయం అనని నాయకులు నేడు అక్రమాలకు పాల్పడిన చంద్రబాబును అరెస్టు చేస్తే మాత్రం అన్యాయం అనడానికి నోర్లు ఎలా వస్తున్నాయన్నారు. అవినీతికి నాయకుడు పాల్పడ్డారని తెలిసినప్పుడు ఆలోచించుకోవాల్సిన తెలుగు తమ్ముళ్లు అభద్రతా భావానికి లోనై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో దోపిడీకి గురైన సొమ్ము ఈ రాష్ట్ర ప్రజలందరిదీ అన్నారు. దీనిపై జీఎస్టీ, సెబీ, ఈడీ, ఇంటెలిజెన్స్, సీఐడీ ఏజెన్సీలు దర్యాప్తు నిర్వహించి ఆర్థిక నేరం జరిగినట్లు నిర్ధారణ చేసుకున్న తరువాతనే చంద్రబాబును అరెస్టు చేశారని బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు.

క్రీడాకారులకు ఎల్లవేళలా ప్రోత్సాహం

- ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనా వెంకట్రావు



పోటీల్లో తలపడుతున్న మహ్మద్ అబ్దుల్ యాసిన్ (తెలంగాణ), పి.వెట్రివేల్ (తమిళనాడు)

ఒంగోలు: క్రీడాకారులకు, క్రీడలకు ఎల్లవేళలా ప్రోత్సాహం అందిస్తామని ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ శింగరాజు మీనా వెంకట్రావు పేర్కొన్నారు. స్థానిక గాంధీ పార్కులో శనివారం రాత్రి జాతీయ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ 2023 పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ స్థాయి మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ పోటీలు ఒంగోలులో ఏర్పాటు చేసినందుకు నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ చిడితోటి జీవన్ మాట్లాడుతూ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడలకు ఇటీవల ఆదరణ పెరుగుతోందన్నారు. నిర్వాహకుడు దీపక్ మాట్లాడుతూ రెండు రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. మొత్తం 110 మంది వివిధ రాష్ట్రాల నుంచి ఫైటర్స్ పాల్గొన్నారని, వీరితోపాటు జాతీయ రిఫరీలు కూడా పాల్గొన్నారన్నారు. ఈ పోటీలు గాంధీపార్కులో నిర్వహించేందుకు సహకరించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఫైనల్స్ పోటీలను వీక్షించిన అనంతరం బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని, క్రీడాభిమానులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ సభ్యులు పి.సుమతి, నితిన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, జైభీమ్ నాగేశ్వరరావు, డాక్టర్ దీపన సాహిత్య, ఝాన్సీ, మోహన్, అజయ్, గోపి, రాము, సన్నీ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ ఆత్మకు నిజమైన శాంతి నేడు

- సమావేశంలో ఎమ్మెల్సీ పోతుల సునీత



మాట్లాడుతున్న పోతుల సునీత

ఒంగోలు: స్వర్గంలో ఉన్న ఎన్‌టీఆర్ ఆత్మకు నిజమైన శాంతి నేడు కలిగిందని శాసనమండలి సభ్యురాలు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నాడు ఎన్‌టీఆర్‌ను చంద్రబాబు వెన్నుపోటు పొడిచినప్పుడు ఎన్‌టీఆర్ తీవ్ర మానసిక క్షోభకు గురయ్యారని, కానీ ఆ క్షణంలో ఆయన కడుపున పుట్టిన ఒక్క కుమార్తెకు కూడా దుర్గమ్మ తల్లిని వేడుకోవాలనిపించకపోవడం బాధాకరం అన్నారు. కానీ నేడు అవినీతి, అక్రమాలకు పాల్పడి అరెస్టు అయిన చంద్రబాబును మాత్రం కాపాడమంటూ దుర్గమ్మ తల్లిని వేడుకుంటుండడం గమనార్హం అన్నారు. తండ్రికో నీతి, భర్తకో నీతా అంటూ భువనేశ్వరిని ప్రశ్నించారు. ఇప్పటి వరకు 40 సంవత్సరాల రాజకీయ ఇండస్ట్రీ, 14 సంవత్సరాల ముఖ్యమంత్రిని అంటూ చెప్పుకునే చంద్రబాబు పాపాల పుట్ట పగిలిందన్నారు. 2014–19 వరకు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రూ.371 కోట్ల ఆర్థిక నేరాలకు పాల్పడినట్లు పక్కా సాక్ష్యాధారాలతో సీఐడీ చంద్రబాబును అరెస్టు చేసిందన్నారు. చట్టాలు అందరికీ ఒకే రకంగా ఉంటాయని, ఎవరికీ చుట్టాలు కాదన్నారు. చంద్రబాబుకు వారం రోజుల క్రితం ఐటీ డిపార్టుమెంట్ నోటీసులు జారీ చేస్తే స్పందించని పవన్ కళ్యాణ్ నేడు చంద్రబాబు అరెస్టును ఖండించడాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. అవినీతి అక్రమాలను ప్రశ్నించడమే జనసేన లక్ష్యమని చెప్పిన పవన్ నేడు అవినీతి, అక్రమాలకు పాల్పడిన చంద్రబాబుకు అండగా వ్యాఖ్యలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని, ఇదంతా కుమ్మక్కు రాజకీయాల్లో భాగమే అన్నారు. ఇప్పటి వరకు కోర్టుల్లో కేసులు సాగకుండా స్టేలు తెచ్చుకుంటూ కాలం గడుపుతున్నారని, కానీ ఎల్లకాలం ఆ పరిస్థితులు కొనసాగవన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో అతిపెద్ద ఆర్థిక నేరానికి చంద్రబాబు పాల్పడ్డారని, లోకేష్ కూడా నాడు మంత్రిగా ఉన్నందువల్ల లోకేష్‌ను కూడా సీఐడీ తప్పకుండా విచారణ చేయాలని కోరుతున్నామన్నారు. రెండేళ్లుగా లోతైన దర్యాప్తు జరిపి పూర్తి సాక్ష్యాధారాలు లభించిన తరువాతే చంద్రబాబును సీఐడీ అరెస్టు చేసిందని పేర్కొన్నారు.

చంద్రబాబుది లెక్కలేనంత అవినీతి


కనిగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

- ప్రస్తుతం పక్కా ఆధారాలతో దొరికినందుకే అరెస్టు
- స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో రూ.371 కోట్లు దోచుకున్నాడు
- అప్పట్లోనే ఈ స్కాంపై ఓ పౌరుడు ఫిర్యాదు, కేసు నమోదు
- అరెస్టులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమేయం లేదు
- కావాలని బురదజల్లితే ప్రజలు మరింత పాతాళంలోకి తొక్కుతారు
- కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

కనిగిరి రూరల్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు లెక్కలకు అందనన్ని కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డాడని, ప్రస్తుతం స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో దోచుకున్న రూ.371 కోట్లకు పక్కా ఆధారాలు దొరికినందుకే అరెస్టు చేశారని కనిగిరి ఎమ్మెల్యే, ఎన్జీ రంగా వర్శిటీ బోర్డ్ మెంబర్ బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. కనిగిరిలోని వైఎస్సార్ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సొమ్మును చంద్రబాబు నిలువునా దోచుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ స్కాం ఇప్పట్లోది కాదని, 2014లో జరిగిందని, 2017లోనే బయటకు రాగా, బాధ్యత గల ఓ సామాన్య పౌరుడి ఫిర్యాదుతో చంద్రబాబు అవినీతిపై కేసు కట్టారని తెలిపారు. అప్పట్లో అధికారంలో ఉన్న చంద్రబాబు దాన్ని తొక్కి పెట్టారన్నారు. నేడు పూర్తి ఆధారాలతో ఇంటెలిజెన్స్, జీఎస్టీ, ఐటీ, ఈడీ, సెబి ఏజెన్సీలు చంద్రబాబును అరెస్ట్ చేశాయని, చట్టం తన పని తాను చేసుకెళ్తోందని అన్నారు. చంద్రబాబు అరెస్టులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎటువంటి ప్రమేయం లేదన్నారు. టీడీపీ నేతలు కావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బురదజల్లె ప్రయత్నం చేయడాన్ని ఎమ్మెల్యే బుర్రా తీవ్రంగా ఖండించారు. టీడీపీ నేతలు చేసిన తప్పును భేషరతుగా ఒప్పుకుంటే ప్రజలు హర్షిస్తారని, కానీ దీన్ని కూడా రాజకీయం చేయాలనుకుంటే టీడీపీని ప్రజలు మరింత పాతాళంలోకి తొక్కేస్తారని మండిపడ్డారు. ఈ స్కాంలో ఎవరెవరికి ఎంతెంత వాటా ఉందనేది త్వరలో తేలుతుందన్నారు. ఇది ఆలీ బాబా 40 దొంగల స్కాంగా అభివర్ణించారు. చట్టప్రకారం పూర్తి విచారణ చేపట్టడాన్ని ప్రజలు హర్షిస్తున్నారన్నారు.

చంద్రబాబు అవినీతికి అడ్డాగా అమరావతి...

అమరావతి.. చంద్రబాబు అవినీతికి అడ్డా అని ఎమ్మెల్యే బుర్రా విమర్శించారు. రూ.600 కోట్ల పనుల్లోనే రూ.118 కోట్ల ముడుపులు తీసుకున్నారని తీవ్రంగా ధ్వజమెత్తారు. చంద్రబాబుకు ఐటీ అధికారులు నోటీసులు ఇచ్చారని, చంద్రబాబు అవినీతి కొంత బయటపడిందని, మొత్తం కాంట్రాక్ట్ పనులపై విచారణ చేస్తే వేల కోట్ల అవినీతి బయటపడుతుందని అన్నారు. చంద్రబాబుకు వచ్చిన ఐటీ నోటీసులను ఖండిస్తూగానీ, స్వాగతిస్తూగానీ పవన్ కళ్యాణ్, రామకృష్ణ, నారాయణ ఎందుకు నోరు మెదపడం లేదని ఎమ్మెల్యే బుర్రా ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, మాజీ ఎంపీపీ భువనగిరి వెంకటయ్య, సొసైటీ చైర్మన్ సంగు సుబ్బారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు, జేసీఎస్ కన్వీనర్లు జీ బొర్రారెడ్డి, భైరెడ్డి తిరుపతిరెడ్డి, జిలాని, పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, జానీ, భవనం కృష్ణారెడ్డి, గురుప్రసాద్, వేల్పుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ స్కాముల్లో ఒకటి మాత్రమే ఇది

- ఆధారాలు లేకుండా చేసినవి మరెన్నో
- చంద్రబాబు అరెస్టు కక్ష సాధింపు కాదు
- స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ఆయనే ప్రధాన సూత్రధారి
- మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


మాట్లాడుతున్న మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు జీఎస్టీ, ఈడీ, ఇంటెలిజెన్స్, సెబీ, ఏసీబీ తదితర దర్యాప్తు సంస్థలు నిగ్గుతేల్చడం వలనే సీఐడీ అధికారులు అరెస్టు చేశారని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. మార్కాపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. చంద్రబాబు అరెస్టు కక్ష సాధింపు కాదని స్పష్టం చేశారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో లెక్కలేనన్నీ స్కామ్‌లు జరిగాయని, అందులో స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ వెలుగులోకి వచ్చిందని అన్నారు. ఆధారాలతో సహా దర్యాప్తు సంస్థలు చంద్రబాబు పాత్రపై నిగ్గుతేల్చాయని, దీంతో చట్టం తన పని తాను చేస్తోందని తెలిపారు. ఇందులో ఎవరి ప్రమేయం లేదన్నారు. దర్యాప్తు సంస్థల అధికారులు పక్కాగా దర్యాప్తు చేసి ఆధారాలు సేకరించిన తర్వాతే చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. సాధారణంగా ఏ బిల్లు ట్రెజరీ నుంచి రావాలన్నా నోట్ ఫైలు ఉండాలని, అలాంటిది రూ.330 కోట్లు ఎలాంటి ఆధారాలు లేకుండా నోటిమాటగా ఎలా డ్రా చేశారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఈ స్కాంపై 2021 నుంచి దర్యాప్తు జరుగుతోందన్నారు. జరుగుతున్న పరిణామాలను, టీడీపీ హయాంలో జరిగిన అవినీతిని రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. టీడీపీ నేతల అనవసరపు రాద్ధాంతాన్ని పట్టించుకోవద్దన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగకుండా రివర్స్ టెండరింగ్ విధానంలో పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి తెలిపారు. ప్రెస్‌మీట్‌లో మార్కాపురం మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్-1, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, వైస్ చైర్మన్-2 అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్లు దూదేకుల ప్రసాద్, డి.హర్షిత, కొండేపల్లి ఎంపీటీసీ కుందురు మల్లారెడ్డి, నాగశ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేములపాడులో చోరీ

- రూ.లక్ష నగదు, 30 గ్రాముల బంగారం అపహరణ

హనుమంతునిపాడు: మండలంలోని వేములపాడు గ్రామంలో పోచం కోటయ్య ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. దీనిపై కోటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. తన కుమారుడికి ఆరోగ్యం బాగలేకపోవడంతో శుక్రవారం కోటయ్య మార్కాపురం వెళ్లాడు. సాయంత్రం వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు పగలకొట్టి ఉన్నాయి. ఇంట్లో చూడగా బీరువా తాళం పగలకొట్టి అందులో ఉన్న రూ.లక్ష నగదు, 30 గ్రాముల బంగారం కనిపించలేదు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించి గుర్తుతెలియని దుండగులు దొంగతనానికి పాల్పడినట్లు బాధితుడు తెలిపాడు. చోరీపై పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు చెప్పాడు.

క్లుప్తంగా

శిద్దా సుధీర్‌కు సన్మానం


శిద్దా సుధీర్‌ను సత్కరిస్తున్న ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

ఒంగోలు: ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ సెంట్రల్ జోన్ చైర్మన్‌గా శిద్దా సుధీర్‌కుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శనివారం విజయవాడలోని ఫార్చ్యున్ మురళి పార్క్‌లో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశానికి శిద్దా సుధీర్ హాజరయ్యారు. ఇటీవల టీటీడీ బోర్డు మెంబర్‌గా, ప్రస్తుతం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ సెంట్రల్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన శిద్దా సుధీర్‌ను దుశ్శాలువాతో సన్మానించారు. అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, మాజీ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, కోశాధికారి అక్కయ్యనాయుడు, డైరెక్టర్లు, జోనల్ చైర్మన్లు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


సంఘటన స్థలంలో యేసేబు మృతదేహం

పొదిలి: లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన ఒంగోలు-నంద్యాల రహదారిపై మండలంలోని పోతవరం వద్ద శనివారం జరిగింది. మండలంలోని ఆముదాలపల్లి పంచాయతీ రాములవీడుకు చెందిన పల్లెపోగు యేసేబు (55) పాస్టర్‌గా పనిచేస్తూ వివాహ సంబంధాలు చూస్తుంటారు. స్కూటర్‌పై కంభాలపాడు నుంచి పోతవరం వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన యేసేబు అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

250 సివిల్, 15 వేల క్రిమినల్ కేసులు పరిష్కారం

ఒంగోలు: దేశవ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లావ్యాప్తంగా ఉన్న న్యాయస్థానాల్లో 250 సివిల్, 15 వేల క్రిమినల్ కేసులను ఇరువర్గాల ఆమోదంతో పరిష్కరించినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి తెలిపారు. లోక్ అదాలత్‌లో వ్యాజ్యాన్ని పరిష్కరించుకోవడం వల్ల ఇరువర్గాలు గెలిచినట్లేనని ఆమె అన్నారు. వారికి కోర్టు ఫీజు తిరిగి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులకు అభినందనలు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం కోసం జిల్లా అదనపు న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ న్యాయమూర్తులు, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఎంతో కృషి చేశారని తెలిపారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈనెల 11న స్థానిక తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఉదయం 11 గంటలకు స్థానికంగా జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 6.15 గంటలకు జ్యోతి ప్లాజాలో రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి నిర్వహించే వ్యక్తిగత సమావేశంలో పాల్గొంటారు. 12వ తేదీ ఉదయం 9గంటల నుంచి విజయసాయిరెడ్డి నిర్వహించే నియోజకవర్గాల సమీక్ష సమావేశానికి హాజరవుతారు. మిగిలిన సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు అందుబాటులో ఉంటారని మాగుంట కార్యాలయ మేనేజర్ భవనం సుబ్బారెడ్డి తెలిపారు.

చంద్రబాబుకు నిరుద్యోగుల ఉసురు

- తప్పు చేసిన వారు శిక్ష అనుభవించాల్సిందే
- వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు


టంగుటూరులో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

టంగుటూరు: తప్పు చేసిన వారు శిక్ష అనుభవించాల్సిందేనని, చంద్రబాబుకు అదే జరుగుతోందని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో నిరుద్యోగులను మోసం చేసి ఆ నిధులు కాజేసిన చంద్రబాబుకు నిరుద్యోగుల ఉసురుకొట్టిందన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వరికూటి మాట్లాడారు. చంద్రబాబును అరెస్టు చేస్తూ సీబీసీఐడీ, రాష్ట్ర పోలీసు శాఖ వారు తీసుకున్న నిర్ణయంపై కొండపి నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. బాబు వస్తే జాబు వస్తుందనే నినాదంతో 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని, ఇంటింటికి ఒక జాబు ఇస్తానని చెప్పి మోసం చేశారని గుర్తుచేశారు. చివరికి బాబు వస్తే నిరుద్యోగికి జాబు రాలేదని, నారా లోకేష్‌కు జాబు వచ్చిందని ఎద్దేవా చేశారు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదని నిలదీస్తే.. తప్పించుకునేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం చేపట్టి ప్రజలను మోసం చేసి డబ్బు కాజేయడం వలనే అరెస్టు చేశారని తెలిపారు. నిరుద్యోగులు, వారి కుటుంబాలు ఉసురు తగిలిందన్నారు. ఇంకా రాష్ట్రాన్ని టిడ్కో ఇళ్ల పేరుతో, తాత్కాలిక రాజధాని పేరుతో చంద్రబాబు దోచుకున్నాడని ఆరోపించారు. అతనికి ఈ జీవితానికి జైలు శిక్ష వేస్తే చాలదని, నాలుగైదు జీవితాలకు శిక్షలు వేయాలని అన్నారు. దోచుకున్నదంతా ఎవరెవరికి ఎంతెంత పంచాడో.. పచ్చ మీడియా ఇంతలా ఎందుకు కాపాడుతోందో తేలాలన్నారు.

ఎన్టీఆర్ ఆత్మకు శాంతి...

చంద్రబాబు అరెస్టుతో పైనున్న ఎన్టీ రామారావు ఆత్మకు శాంతి కలిగిందని వరికూటి అశోక్‌బాబు అన్నారు. ఎన్టీఆర్ ఎంతో నమ్మకంతో చేరదీస్తే అతనిపై చెప్పులు వేయించిన చంద్రబాబు.. ప్రస్తుతం జైలుకు పోవడం ఖాయమని, అదే ఎన్టీఆర్‌కు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు దోచుకుంటే.. కొండపి నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే స్వామి మరుగుదొడ్లు నిర్మించకుండా ఆ నిధులు దోచేశాడని ఆరోపించారు. బయటకి రాకుండా ఇంట్లోనే ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం చేయడం సిగ్గుచేటని అన్నారు. రోడ్డు మీదకు వచ్చే దమ్ము లేకుండా 25 కేసుల్లో స్టే తెచ్చుకున్న ఎమ్మెల్యే స్వామి కూడా త్వరలో జైలుకు పోతాడని పేర్కొన్నారు. కార్యకర్తలను రెచ్చగొడుతూ కొండపి నియోజకవర్గంలో ప్రశాంతత లేకుండా చేస్తున్నాడని, అరాచకాలకు పూనుకుంటే సహించేది లేదని వరికూటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, సింగరాయకొండ జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, ఏఎంసీ కొండపి డైరెక్టర్లు కొమ్ము సురేంద్ర, టంగుటూరి రామకృష్ణ, నల్లూరి సురేంద్ర, మధు, మన్నం వెంకయ్య, మేదరమెట్ల భరత్‌రెడ్డి, శారీమందిర్ వెంకటేశ్వర్లు, కోటి, జక్కా రాజేశ్వరరావు, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను విజయవంతం చేయాలి

- డీఎంఅండ్‌హెచ్‌వో రాజ్యలక్ష్మి


జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేని పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో రాజ్యలక్ష్మి

ఈతముక్కల (కొత్తపట్నం): గ్రామీణ ప్రాంత ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఎన్నో ఉపయోగాలు పొందవచ్చని డీఎంఅండ్‌హెచ్‌వో రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్య పరిస్థితులపై సమగ్ర సర్వే చేయించి ఏ గ్రామంలో ప్రజలు ఏయే వ్యాధులతో బాధపడుతున్నారో గుర్తించనున్నట్లు తెలిపారు. అక్టోబర్‌లో ప్రతి మండలంలో హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు రావడంతో శనివారం ఈతముక్కల పీహెచ్‌సీ పరిధిలోని గమళ్లపాలెం పంచాయతీని పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని సర్వే చేశారు. ఈ సర్వేని డీఎంఅండ్‌హెచ్‌వో రాజ్యలక్ష్మి పర్యవేక్షించారు. సర్వే ఏ విధంగా జరుగుతోంది.. ఎక్కువగా ఏయే వ్యాధులున్నాయి అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు గృహాలను సందర్శించి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయిలో ప్రజల ఆరోగ్య పరిస్థితులు ఎలా ఉన్నాయి, ఎక్కువగా ఏయే వ్యాధులతో బాధపడుతున్నారనే పూర్తి సమాచారం సేకరిస్తోందని తెలిపారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సీహెచ్‌వోలు కలిసి సర్వే చేసి ఇంటి దగ్గరే పరీక్షలు చేస్తారని చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో నయం కాని వ్యాధులకు మండల స్థాయిలో జరిగే హెల్త్ క్యాంపుల్లో చికిత్స చేస్తారని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ట్రయల్ రన్ సర్వేగా గమళ్లపాలెం గ్రామంలో రెండు రోజుల పాటు సర్వే చేయిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామస్తులు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈతముక్కల ఆరోగ్య కేంద్రం డాక్టర్ డి.వెంకటేష్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఐదుగురు ఎంపిక


రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జరుగుమల్లి: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఐదుగురు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మత్రిబోయిన శ్రీనివాసరావు తెలిపారు. సింగరాయకొండలో నిర్వహించిన జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-16 విభాగంలో డోలా అంజన లాంగ్‌జంప్‌లో ప్రథమస్థానం, ఎస్.నందిని 300 మీటర్ల పరుగు పందెంలో ప్రథమస్థానం, డి.లావణ్య 800 మీటర్ల విభాగంలో ద్వితీయస్థానం, కె.మధులత హైజంప్‌లో ప్రథమస్థానం, షాట్‌పుట్ అండర్-14 విభాగంలో ఆర్.లాస్య ప్రథమస్థానం సాధించినట్లు వివరించారు. కామేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పి.ప్రభుకుమార్ అండర్-18 విభాగం లాంగ్‌జంప్‌లో ప్రథమస్థానం సాధించినట్లు హెచ్‌ఎం ఎల్.అనూరాధ తెలిపారు. వీరు ఆరుగురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారని వ్యాయామ ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, ప్రసాద్ వివరించారు.

రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొట్టిన లారీ


మృతిచెందిన మంగమ్మ


మంగమ్మను ఢీకొట్టిన లారీ

బల్లికురవ: పొలం వెళ్లి గ్రామంలోకి వస్తున్న మహిళను వేగంగా వెళ్తున్న లారీ ఢీకొట్టటంతో మృతి చెందింది. ఈ ఘటన శనివారం మేదరమెట్ల-నార్కెట్‌పల్లి రహదారిపై బల్లికురవ మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామం వద్ద జరిగింది. గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు రావులపల్లి వెంకటేశ్వర్లు తల్లి మంగాయమ్మ అలియాస్ మంగమ్మ (45) పశువుల మేతకు గ్రామానికి పడమరవైపున్న పొలాలకు వెళ్లింది. మేతమోపుతో గ్రామంలోకి వస్తుండగా చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్తున్న టీఎస్37 డీఆర్ 0471 లారీ ఢీకొట్టింది. దీంతో ఆమె తలకు గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో వైద్యానికి నరసరావుపేట తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయింది. మృతురాలికి భర్త కోటేశ్వరరావు, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడు వెంకటసుబ్బారావు ఫిర్యాదు మేరకు బల్లికురవ పోలీస్‌స్టేషన్ రైటర్ ఎం.సీతారామాంజనేయులు కేసు నమోదు చేశారు. లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మంగమ్మ భౌతికకాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.